


‘ఏమిటండీ! మళ్ళీ సిగరెట్టు వెలిగిం
చారు? అన్నం వడ్డించేస్తేనూ!”
“సారీ! ఒక్క నిమిషం- వచ్చేస్తు
న్నాను.”
“ఇందాకనూ అలాగే అంటిరి. మళ్ళీ
యిల్లంతా పొగమయం. ఇలా కాలు

స్తూంటే యింక ఆకలి ఏమి వుంటుంది? అబ్బబ్బ!"

మధురం విసుక్కుంటూ వంటింట్లోకి వెళ్ళింది. కంచంలో వడ్డించిన పదార్థాల మీద ఒక అరిటాకు కప్పింది. గోడ కానించిన పీట ముందుకి లాక్కుని పొయ్యి ముందు కూలపడింది. భర్త ఆ వెలిగించిన సిగరెట్టు కాలికింద నలిపి వెంటనే వస్తాడని ఆశించింది. పది నిముషాలు, పదిహేను, అతని జాడలేదు; కనీసం పిలుపయినా లేదు.

"ఏమండోయ్! మిమ్మల్నే;" లోపల్నుంచే అరిచింది. కానీ జవాబు లేదు.

భోజనం వడ్డించినాక, యిది మూడో సారి మధురం అతన్ని హెచ్చరించటం ఈ మాటు భర్త పడక్కుర్చీలో లేడు. దీర్ఘాలోచనలో వున్నట్టు గదిలో అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు. మధురం గాజుల చప్పుడికి గానీ కనీసం విసురుకి గానీ అతను వెనుతిరగలేదు.

"ఇదేం ఖర్మ! పైత్యం ఏమీ చేయలేదుకద! మరీ ఇంత పరధ్యాన్నమా!" అనుకుంటూ ముక్కుమీద వేలేసుకుంది.

పెళ్ళినాడు మధురం తల్లి అన్నది, "చూడమ్మాయీ! అల్లుడు పత్రికలో పని చేస్తున్నాడు. అదేదో పగలనక, రాత్రనక రాసే పనిట! అంతంత ఆలోచనలు చేస్తారేమో తల బాగా వేడెక్కే పనిట! కనులమ్మగారూ వాళ్ళూ కూడా అన్నారు. కాస్త జాగ్రత్తగా చూసుకో తల్లీ! మంచి ఆహారం, కాస్త చల్లనివీ అదీ చేసి యిస్తూవుండు. అస్తమానం రుసరుసలాడక." ఈ మాటలు మధురం మీద బాగా పనిచేశాయి.

అసలే బోళాది మధురం. అందులో పెద్దచదువులూ లేవు. తన తండ్రి, తాత, మామలని పోస్టాఫీసులో గుమాస్తాలు గానూ, ప్లీడర్లుగానూ, వైద్యులుగానూ చూసిందిగానీ యిలా రాయటం, పత్రికలూ ఆమెకి బొత్తిగా అనుభవం లేవు. అంతేకాదు, పెళ్ళయిన కొత్తలో 'నీ మొగుడి కేంపని?' అని ఎవరయినా అడిగితే వెంటనే సమాధానం దొరక్క తడబడేది. విశ్వనాథంగూడా భార్య ప్రవర్తనకి పైకి నవ్వినా, లోలోపల గర్వపడకుండానూ పోలేదు. అత నేదయినా తలనొప్పి అన్నా, కాస్త కళ్ళు ఎర్రబడి మత్తుగా పడుకున్నా, మధురం తెగ ఆరాట పడిపోయేది.

ఈ రోజు కూడా భర్తవాలకం చూసి నిజంగా అతనికి శిరోవాత మో ఏదో చేసిందని రూఢి చేసుకుంది.

"ఏమండోయ్, మిమ్మల్నే. ఒంట్లో కులాసాయేనా?" అంది హీనస్వరంతో

ఓ క్షణం చూశాడు.

"పద, పద," అంటూ కాలుస్తున్న సిగరేటు కిటికీలోంచి బైటికి పారేసి, వంటింట్లోకి నడిచాడు. "సారీ డార్లింగ్" అంటూ మధురం బుగ్గన చిటిక వేసి, చేతులు కడుక్కుని, ఆమె కొంగుకి బల

వంతంగా తుడుస్తూ, పీటమీద కూర్చున్నాడు. అన్నం కలుపుకుంటూ ఇలా అన్నాడు.

"మధురం, ఓ తమాషా జరిగింది."

"ముందు భోజనం కానివ్వండి. ఆ నాలుగు మెతుకులూ నెమ్మదిగా తినక, యిప్పుడు ఖబుర్లకీ, కథల కేం కొదవ," అంటూ మూతి ముడిచింది మధురం. విశ్వనాధం ఆమెకేసి చూసి ఓరగా నవ్వాడు.

"మధురం ఓ అమ్మాయిని చూశాను."

"ఎక్కడా ?" ఎంత దాచుకున్నా ఆమె ముఖంలో కుతూహలం, ఈర్ష్యా, అనుమానం ఒక్కసారి పైకుబికాయి.

"అమ్మాయంటే రోడ్డుమీద నడుస్తున్న కాలేజీ పిల్లకాదు."

"మరి."

"స్నేహితుడి భార్య"

"ఇంకేం : ఇప్పుడు ఆవిణ్ని గురించి ఓ కథ అల్లి వుంటారు. ఇక అచ్చుకి వెళ్ళిపోతుంది; అంతేగా ?"

"ఛీ! ఛీ! కథకాదే. అసలు సంగతి. ఆవిణ్ని ఎక్కడ చూశానో సరిగ్గా జ్ఞాపకం రావటం లేదు. కానీ బాగా ఎరిగున్న ముఖం."

"ఊరుకొండి. ఎవరన్నా వింటారు. పైగా స్నేహితుడి భార్య కూడానూ."

మధురం నోటికి చెయ్యి అడ్డం పెట్టుకుంది.

* * *

విశ్వనాధం భోజనం చేసిన తీరు ఆమెకి తృప్తిగా అనిపించలేదు. తాంబూలం యిస్తూ, అత నింకా పరధ్యానంగా వుండటం గమనించింది. ఇలాటి సమయంలో అతన్ని మాటల్లోకి దింపటం మంచిది కాదేమో అనుకుంటూ, తను భోజనం ముగించేందుకు ఉపక్రమించింది. కానీ మధురానికి ఒక్క ముద్దకూడా మింగుడు పడలేదు. ఎవరో స్నేహితుడి భార్య జ్ఞాపకం రాకుండా పోవటం ఏమిటి ? ఈయన తన తల బద్దలు కొట్టకోవటం ఏంటి ? మధురం ఆలోచనలు రకరకాలుగా పరిగెత్తాయి. గదిలో చాప వేసుకుని పడుకుంది గానీ మధురానికి కునుకు పట్టలేదు. రోజూ అయితే మధ్యాహ్నం భోజనం అవగానే నిద్రపోయేది. రెండు మాట్లు లేచివెళ్ళి గ్లాసు తీసి మంచినీళ్ళు తాగివచ్చింది. అలా లేచినప్పుడు భర్తగదిలోకి తొంగి చూసింది. అత నింకా సిగరెట్టు పీలుస్తూ ఆలోచనలో వున్నాడు.

కాస్సేపయింది. అన్నం సరిగా తిననందువల్లా, ఉదయం నుంచీ చాకిరీ భారం వల్లా, మధురానికి తెలియకుండానే కునుకు పట్టేసింది. ఇంతలో గబుక్కున బుజం ఎవరో బలంగా వూపుతున్నట్లయి, కళ్ళు నులుపుకుంటూ లేచి కూర్చుంది.

"ఏమయిందండీ ?" అనడిగింది భర్త ముఖంలోకి ఖంగారుగా చూస్తూ.

"మధురం! అబ్బ! ఇప్పటికి గుర్తు వచ్చింది. లే! లే!!" అంటూ బుజాలట్టుకుని ఆమెని నిలబెట్టాడు విశ్వనాధం.

ఆమెకి యింకా ఏం అర్ధం కావటం లేదు. సగం సగం మత్తుగా వుంది.

"టైమెంతయింది? కాఫీ పెట్టనా?" అంది.

"ఊహూ! అవన్నీ తరువాత. ముందు హాల్లోకి రా. జరిగిందంతా చెబుతాను."

ఇద్దరూ హాల్లోకి నడిచారు. విశ్వనాధం ప్రారంభించాడు. మధురం కళ్ళు పెద్దవి చేసుకు వింటోంది.

"కొద్ది రోజులక్రితం అకస్మాత్తుగా ట్రంకురోడ్డుదగ్గిర నా పాత స్నేహితుణ్ణి కలిశాను. వాడూ నేనూ కాలేజీలో నాలు గేళ్ళు కలిసి చదువుకున్నాము. గోపాలంది పెద్దకుటుంబం. డబ్బు మంచినీళ్ళలా ఖర్చు చేసేవాడు. మంచి మనసు, మాటకారితనం గలవాడు. నాకూ వాడికీ మంచిస్నేహం ఏర్పడింది. మా భావాలూ, అభిరుచులూ దాదాపు ఒకటే ననీ, సినిమా హాల్సులోనూ, పార్కు డిస్కషన్సు లోనూ, కాఫీ హోటళ్ళలోనూ తేల్చేసుకున్నాము. వాడి కుటుంబంతో ఆట్టే పరిచయం లేకపోయినా, రాజమండ్రిలో వాళ్ళింటికి ఓ మాటు వెళ్ళానుకూడా.

నాకు వుద్యోగమయి మద్రాసులో స్థిరపడ్డాకనే వాడు ఒక ప్రయివేటు కంపెనీలో చేరి బొంబాయి వెళ్ళినట్లు తెలిసింది. ఆరు సంవత్సరాలయింది; వాణ్ణి కలవనేలేదు. కొన్నాళ్ళకి ఉత్తరాల రాకపోకలూ నిలిచిపోయాయి. ఎవరిగొడవల్లో వాళ్ళం వుండిపోయాము.

అలాటిది హఠాత్తుగా మొన్న వాడు కనబడేసరికి ఆనందంతో ప్రాణం కొట్టుకుపోయింది. ట్రాఫిక్కయినా గమనించకుండా అమాంతం వాడు నన్ను కౌగలించుకున్నాడు. తనకి మద్రాసు బదిలీ అయిందనీ, గత సంవత్సరం వివాహం కూడా చేసుకున్నాననీ చెబుతూ, బలవంతంగా మైలాపూరులో వాడింటికి లాక్కెళ్ళాడు. గుడిదగ్గిర చిన్న యిల్లు. మెట్లెక్కి పైకి వెళుతుంటే అతని భార్య ఎలా వుంటుందాఅని ఊహించుకున్నాను. నిజానికి గోపాలం కురూపి కాకపోయినా అందగాడు మటుకు కాదు. చామనచాయ, కాస్తపొట్టి, కళ్ళజోడు, పలుచనిక్రాపు, మాటలధోరణి ప్రారంభించేవరకూ మనుష్యుల్ని ఆకర్షించలేడు.

పైకి వెళుతూనే "సీతా! యిలారా" అంటూ హడావుడిగా భార్యని పిలిచాడు. పూలకట్టెను మెల్లిగా తొలిగింది; ఒక్క మెఱుపు మెరసినట్లయింది. నిజంగా అశోకవనంలో సీతలా వుందనుకో మెడమీదుగా, మోచేతి కిందివరకూ పడుతున్న చిక్కని నల్లనిజుత్తు, పసిమి ఛాయ, కోలకళ్ళు, గులాబిరంగు పెదిమలు, బొమ్మ! నేను తెప్పరిల్లే ముందు అతను భార్యని నాకు పరిచయం చేశాడు.




ఆమె జుత్తు వెనక్కి జారుగా ముడివేసి, కొంగుతో బుజాలు కప్పుకుని నాకు నమస్కరించింది. కుర్చీ లాక్కుని కూచుంటూ చిన్నగా నవ్వింది. అంతే! ఆ క్షణానే నాకు అనిపించింది. ఆనవ్వు యింతకుముందు చూశాను. ఆ చూపులు నాకు చిరపరిచిత మయినవి.''

మధురం కుడిచెయ్యి చెంపకి ఆనిస్తూ కుర్చీలో వెనక్కి వాలింది.

"మీకు కాదు శిరోవాతం. ఇప్పుడు నాకు వచ్చేటట్లుగా వుంది. ఊఁ! కానివ్వండి," అంది.

విశ్వనాథం మళ్ళీ ప్రారంభించాడు. "ఆ రోజు ఓ అరగంట కూర్చున్నాను – అక్కడ. ఆమె కాఫీ ఇచ్చింది. ఫలహారం తెచ్చింది. నాలుగయిదు మాట్లు గదిలో అటూ ఇటూ తిరిగింది. కానీ నా కింక అయోమయంగానే ఉంది. అప్పట్నుంచీ దాదాపు రోజూ సాయంత్రాలు వాడు ఆఫీసులో కలుసుకుని నన్ను ఇంటికి తీసుకువెళుతూనే వున్నాడు. ఆమెను ఇంతకుక్రితం చూసిన గుర్తు దృఢమయింది నాలో; కానీ ఫలానా అని తేలలేదు."

"పోనిద్దురూ! ఇదీ ఒక సమస్యేనా? కాలేజీల్లోనూ అక్కడా ఇప్పుడు అమ్మాయిలు బోలెడంత మంది. ఎక్కడో చూసివుంటారు. ఏ బస్సులోనో, ఆఫీసులోనో; అయినా ఆ విషయమై ఆమెనే అడిగి తేల్చుకోరాదూ?"

"అబ్బ! విను మధురం. ఇప్పుడు నాకు గుర్తు వచ్చింది – ఆలోచించగా,

ఆలోచించగా." విశ్వనాథం జేబులో అగ్గిపెట్టెకోసం వెతికి సిగరెట్ వెలిగించాడు.


"కాలేజీ చదువులు పూర్తయి ఉద్యోగాన్వేషణకోసం నేను కలకత్తా వెళ్ళిన కొత్తరోజులవి. స్నేహితులం నలుగురం కలిసి కలకత్తా గల్లీలో ఒక గది తీసుకున్నాము. ఇది దాదాపు ఆరు సంవత్సరాలనాటి విషయం. నాకు ఒక ప్రయివేటు కాలేజీలో ఇంగ్లీషు ట్యూటరుగా పని దొరికింది. అర్ధరోజు పని, మిగతా కాలం పేకాట, షికార్లు, తిరగటం. మిగతా ముగ్గురూకూడా ఏవో చిల్లర ఉద్యోగాలు సంపాయించారు తలా ఒక చోటా. మేము వుంటున్న గదికీ, మా ఉద్యోగ స్థలాలకీ చాలా దూరం. అందుకని సాయంకాలాలు బజారు వీధిలో ఒక మందుల షాపులో కలుసుకునే వాళ్ళం, ఆ షాపు యజమాని చూనీలాల్ అని సరదా అయినవాడు. వయసులో మా కంటె పెద్ద అయినా, మాలాటి కుర్రాళ్ళని చేర్చి, పేకాట, కాఫీలు ఏర్పాటు చేసేవాడు.

దుకాణం వెనకాల ఓ చిన్నగదిలో మేము చేరేవాళ్ళం. రాత్రి ఎనిమిది, తొమ్మిదిదాకా ఆటలు సాగించి, అక్కడే టీ కొట్లో కాసిని పూరీలూ, పాలూ సేవించి గది చేరుకునేవాళ్ళం." మధురం ముఖం చిట్లించింది.

"అప్పటి మా జీవితానికి ఒక దారీ తెన్నూ వుండేదికాదు. ఎన్నెన్ని కష్టాలు పడకపోతే మనుష్యులు ఇంతింత అవుతారో తెలుసా!" అంటూ విశ్వనాథం మధురం గడ్డం తనవైపుకి తిప్పుకున్నాడు; మళ్ళీ ప్రారంభించాడు.

"ఆ చునీలాల్ వ్యక్తిగత జీవితం గురించి మాకు అట్టే తెలియదు. అతనింటికి మే మెప్పుడూ వెళ్ళలేదు. కానీ అతని కోసం ఒక స్త్రీ ఆ దుకాణానికి వస్తుండేది. ఆమె అక్కడ అతన్ని కలియటంబట్టి, యింటిదగ్గిర నిర్బంధం ఏదో వుందని, యిలాటివి మేము ఊహించుకున్నాము. ఆమెను ముఖాముఖి మేము చూడక పోయినా, జిగేలు మనే చీరకొంగు ఓ మాటూ, గాజుల గల గల ఓ మాటూ, నవ్వు యింకోమాటూ, యిలా ఆమె మాకు పరిచయమైంది. ఒక్కొక్కప్పుడు సాయంత్రం ఆరు ఏడు గంటల ప్రాంతాల నౌఖరు లోపలికి వచ్చి "అమ్మగారొచ్చారు," అని చెప్పేవాడు. అతని మాట పూర్తి కాకముందే చూనీలాల్ టోపీ సరిచేసుకుంటూ బైటికి పరుగెత్తేవాడు. మరో అయిదు నిముషాల్లో కారు హారను మాకు వినిపించేది అలా చాలా మాట్లు మాఆట కట్టయ్యేది.

ఓరోజు కాస్త మబ్బుగావున్నా నేను దుకాణంవైపుకి వెళ్ళాను. నేను గుమ్మంలో అడుగు పెట్టీ పెట్టటంతోటే చినుకులు ప్రారంభమయాయి. అరగంట కాచుకున్నా స్నేహితుల జాడ లేదు.




ఈరోజు చూనీలాల్ గూడా దుకాణానికి రాడనీ, ఒంట్లో అస్వస్థతగా వుందనీ నౌఖరు చెప్పాడు. నేను చాలా నిరుత్సాహ పడుతూ తిరిగి కొంప ఎలా చేరుకో వటమా అని ఆలోచిస్తూ దుకాణంలో జతగా నిలబడ్డాను.

ఇంతలో గొడుగు మూస్తూ ఒక స్త్రీ హడావుడిగా లోపలికి వచ్చింది. దీపం వెలుగులో ముఖం, కళ్ళూ స్పష్టం గా చూశాను, చాలా అందమయింది. నా రెప్పలు మరి మూతబడలేదు. నౌఖరుతో ఏదో గుడగుడ లాడి ఆమె నావైపుగా వచ్చింది.

"క్షమించండి, నాకో సహాయం చేసి పెట్టగలరా ?'' అంది చిరునవ్వుతో.

నేను తెల్లబోతూ ఆమె వంక చూశాను.

"నేను మీకు తెలియకపోయినా, మిమ్మల్ని నేను ఎరుగుదును. నేను చూనీలాల్‌తో అవసరంగా మాట్లాడ వలసివుంది. నెంబరు యిస్తాను. డయల్ చేసి అయన్ని పిలవండి. నేను మాట్లాడు తాను,'' అంది.

ఆమెకు కావలసిం దేమిటో నాకు అర్థమయింది. అలాగే చేశాను. థ్యాంక్స్ చెప్పి వెళ్ళిపోయింది.

ఆ సంఘటన తరువాత ఆమెతో నేను మళ్ళీ సంభాషించడం జరగలేదు. ఒకటి రెండుసార్లు చూనీలాల్‌తో కలిసి వెళ తుండటం చూశాను. దూరాన్నుంచే ఆమె నన్ను చూసి కృతజ్ఞతా పూర్వకంగా నవ్వింది. అంతే, ఆ తరువాత కొన్నాళ్ళకి నేను మద్రాసు వచ్చేశాను. ఆమెగురించి నే నేమీ వినలేదు. అసలు ఆమె విషయం మర్చిపోయాను కూడా. ఆలాటిది గోపాలం యింట్లో అతని భార్యగా మొన్న నాకు కనుపించింది."

"మీదంతా వుత్తి వూహ. మను

ష్యల్ని పోలిన మనుష్యులు వుంటారు. ఎక్కడ కలకత్తా, ఎక్కడ రాజ మండ్రీ?" మధురం పెదవి విరిచింది.

"ఊహేమిటి మధురం? కళ్ళారా చూశాను. గుర్తుపట్టాను. ఇంకో విషయంకూడా చెప్పాలి నీతో. ఆ మొదటి రోజు వెళ్ళినప్పుడు ఆమె నన్ను గుర్తించినట్లు కనపడకపోయినా తరువాత తరువాత కొంచెం జంకటము, నా ముఖంలోకి సూటిగా చూడ భయపడ టము ప్రారంభించింది. ఇప్పుడు గుర్తుకు వస్తోంది. ఓరోజు కలకత్తాలోని రోజుల గురించి చెబుతుంటే. ఆమె చటుక్కున ఏదో పని వున్నట్లు లోపలికి వెళ్ళిపో యింది. అంతేకాదు; ఓరోజు గోపాలం దగ్గిర శలవు తీసుకు వస్తుంటే, కిటికీ గుండా దీనంగా నా వంక చూసింది."

"పోనిద్దురూ! ఏదోవివాహమయింది, వాళ్ళిద్దరూ సుఖంగా వుండటమే స్నేహి తులైన మీకూ కావలసింది. ఆవిడ చరిత్ర అంతా తవ్వుతూ మీరు అటు కేసి తరచు వెళ్ళటం మానెయ్యండి. లేనిపోని పొరపొచ్చులు వాళ్ళ మధ్య పెట్టిన పాపం మీ కెందుకు మధ్యన?" అంది మధురం విసుగ్గా.

"అదికాదే మధురం. గోపాలంది ప్రేమ పెళ్ళి కూడా కాదు. సాక్షాత్తూ తండ్రి కుదిర్చిన, పెద్దలు చేసిన సంబం ధము. ఎంతపొరపాటో చూడు. వాణ్ని నేను బాగా ఎరుగుదును. వుత్తి అమా యకుడు. భార్య చరిత్ర ఏనాటికైనా తెలిస్తే ఎంత మధన పడతాడు? వాడికి ఎంత షాక్ యిస్తుందో వూహిస్తే నాకు వెర్రెత్తినట్లు వుంది!!!"

"ఎలా తెలుస్తుంది? మీ లాటి స్నేహితు లెవరైనా పుణ్యం కట్టుకోక పోతే? అయినా పిల్ల చక్కని దంటు న్నారు. కలకత్తా మహా నగరంలో ఒంటిరిగా వెళితే ఏ దుష్టులో పాడుచేయ ప్రయత్నించి వుంటారు. ఇప్పు డేదో కుదురుగా సంసారం ఏర్పరచుకుంది. ఆడవాళ్ళ జీవితాల్లో ఎలాటి చిక్కుతీగె లుంటాయో మీ కేం తెల్సుగనక?"

"నువ్వలా స్త్రీ జాతిని వెనకేసుకు రావటమే నాకు గిట్టదు. ఒక వ్యక్తితో సన్నిహితం ఏర్పరచుకుని, కొన్నాళ్ళు తిరిగి అమాయకుడైన మరో వ్యక్తిని డబ్బుకోసం, హోదాకోసం వివాహము ఆడటంకంటే క్రూర మేముంది? రేపు వాళ్ళ భవిష్యత్తు ఏమిటి? ఆ చూనీలాల్ మరెవరయినా గానీ తటస్థపడితే ఏమవు తుంది? ఇవన్నీ ఆలోచించావా? నువ్వె న్నయినా చెప్పు, స్త్రీ అబల, అసహాయు రాలు అనే మారుపేరున ఎన్నెన్ని దౌర్జన్యాలయినా చేయగలరు."

"పోనీ మీరు చెప్పిందే నిజంగానీ, మీరు మటుకు ఇక ఆ చాయలకి వెళ్ళ కండి. ఎందుకయినా మంచిది."

"అదేమిటి? ఆమెకోసరమని స్నేహితుణ్ని వదులుకుంటానా? వాడు



మనింటికి రావాలని చాలా ఆరాటపడు ఆదివారం ఉదయున్నే మనింటికి భోజ
తున్నాడు. నిన్ను చూడలేదుకూడా. వచ్చే నానికి పిలుస్తున్నాను."

లేచి వెళ్ళిపోతున్న భర్తకేసి ఆశ్చర్యంతో చూసింది మధురం. విశ్వనాథం అన్నమాట ఆచరించేవాడే. గోపాలాన్ని భోజనానికి పిలిచేందుకు మర్నాడే బయలుదేరి వెళ్ళాడు.

*  *  *

గోపాలం ఇంట్లో లేడు. సీత తలుపు తెరిచింది. విశ్వనాథాన్ని చూసి తెల్లబోయింది. "ఆయన ఇంట్లో లేరు," అంది గుమ్మంలోనే నిలబడి.

"ఒక్కమాట చెప్పిపోవాలని; రేపు ఆదివారం మీరు ఉభయులూ మా ఇంటికి భోజనానికి రావాలి.'' విశ్వనాథం బైటే ఎండలో నిలబడ్డాడు.

"క్షమించాలి. ఆ రోజు మేము మరోచోటికి వెళ్ళవలసి ఉంది.'' ఆమె చిన్నగా నవ్వింది. ఆ నవ్వు విశ్వనాథానికి బలా న్నిచ్చింది. 'నువ్వు నాకు తెలుసు' అన్నట్లు ఆమె వంక చూసి నవ్వాడు.

"లోపలికి రారూ ?'' సీత దోవ చూపించింది. అతను ముందుకి నడిచాడు. ఓ అయిదు నిముషా లిద్దరూ మౌనంగా కూర్చున్నారు.

"మంచినీళ్ళు," అన్నాడు చివరికి నేలకేసి చూస్తూ.

"ఒక్క నిముషం. కాఫీయే పట్టుకొస్తాను." సీత రివ్వున లోపలికి వెళ్ళింది. ఆ మాట, ఆ పరుగు అతనికెంతో సన్నిహితంగా తోచాయి. వెంటనే వెళ్ళిపోదా మనుకున్నా ఓ ... ంట అక్కడే కూర్చున్నాడు. కాఫీ ... డు. వక్కపొడి వేసుకున్నాడు. ఊ ... ఆడు తున్న సినిమాల గురించీ, వాతావరణం గురించీ ఆమెతో ఖబుర్లు చెప్పాడు.

*  *  *

ఓ వారం గడిచింది. భర్త తిరిగి స్నేహితుడి విషయం ఎత్తకపోవటం మధురానికి ఆశ్చర్యం కలిగించింది.

"ఏమండీ! మీ స్నేహితుణ్ని భోజనానికి పిలుస్తా నన్నారు," అనడిగింది ఓరోజు ఉండబట్టలేక.

"ఆఁ, వాడు బిజీగా ఉన్నాడు. నేను యీ మధ్య కలపటంలా," అన్నాడు ముభావంగా.

కానీ నిజానికి విశ్వనాథం స్నేహితుడి యింటికి తరుచు వెళుతున్నాడు. ఈమధ్య గోపాలం యింట్లోవున్నా, వుండకపోయినా అతనికి భేదం కనుపించటం లేదు. సీత ఆతిథ్యం అతనికి తృప్తికరంగా వుంది.

మధురం పుట్టింటికి వెళ్ళిందనే నెపంతో అతను చాలాసార్లు వాళ్ళింట్లో భోంచేస్తున్నాడు కూడా. గోపాలం అటన్ని యింటకుట్రలం మల్లేనే ప్రేమ భావంతో చూస్తున్నాడు. సీత మాటలో, చూపులో అతని కెంతో కృతజ్ఞతాభావం కనబడుతోంది. ఆమె మునుపులా కాక, అతనితో చాలా ఖబుర్లు చెబుతూంది. ఉపభర్తా, అతని స్నేహితుల్ని గురించి



తరచు వివరాలు అడుగుతూంది. అతని భార్యా మధురాన్ని కలవాలనే కోరిక వెల్లడించింది.

* * *

అది డిశంబరుమాసం. ఆ రోజు మబ్బుగా వుంది. ఆఫీసులో పని చూసుకుంటున్న విశ్వనాథం సిగరెట్టుమీద సిగరెట్టు కాలుస్తున్నాడు. గడియారం చూసుకుంటున్నాడు. మూడవుతోంది. టైపిస్టుని పిలిచి, తన కవసరమైన

పనుందని మేనేజరుకి చెప్పమని చెబుతూ, ఆఫీసుబైట పడ్డాడు. స్కూటరు వేసుకుని మైలాపూరువైపు వెళ్ళాడు. గోపాలం యింటిముందు దిగాడు.

"ఎవరూ ?'' అంటూ తలుపు తెరిచింది సీత.

"నేను;" అతని మాటలు తడబడు తున్నాయి.

"రండి'' ఆమె తోవ చేసింది.

అప్పటికే బైట చినుకులు ప్రారంభ మయాయి. అతని షర్టు కొద్దిగా తడిసి వుంది. కుర్చీలో కూర్చుంటూ రుమా లుతో చేతులూ తలా తుడుచుకున్నాడు.

"తువ్వాల కావాలా?" అంటూ సీత లోపలికి వెళ్ళింది. ఆమె తిరిగివస్తుంటే అతను దాదాపు లోపలి గదివరకూ వెళ్ళి పోయాడు.

''స్కూటరు యింకా అట్టే పెట్టి వుంచాను." అతని స్వరం కొంచెం తగ్గు స్థాయి అందుకుంది.

"మినర్వాలో మంచి యింగ్లీషు సినిమా వుంది. వస్తారా?"

ఆమె ఏం అర్థం కానట్లు చూస్తోంది యింకా.

"ఈసరికి గోపాలం యింకా ఆఫీ సులో వుంటాడు. మనల్ని ఎవరూ చూడరు," అతను తొందరలొందరాగా అంటున్నాడు.

"అలా చూస్తారేం? నన్ను యింకా అర్థం చేసుకోలేదూ?"

సీత చేతిలోంచి తువ్వాల కింద పడి పోయింది. అతను బలంగా ఆమెని దగ్గి రకి లాక్కున్నాడు.

ఎడం చెంపమీద వేడిగా ఓ చేయి ఛెళ్ళున పడటంతో, విశ్వనాథం వెనక్కి వాలాడు.

అతని ప్రపంచం కళ్ళు తెరుచు కుంది. తా నెక్కడుందీ, ఏమయిందీ బోధపడింది. సీత వంటింటివయిపు చరచర వెళ్ళటం చూసి, ఒక్క దూకున బైటపడి, వెయిట్ చేస్తున్న ఆటోలో ఎక్కాడు

వేళకాని వేళ, అందులో వానలో భర్త ఆటోలో ఇంటికి రావటం చూసి, మధురం చాలా గాభరా పడిపోయింది. విశ్వనాథం ముఖం కందగడ్డలా ఎర్రనై వుంది. నుదుటిమీద చినుకుల్లాంటి స్వేద బిందువు లున్నాయి. అతను లోపలికి వచ్చిరావటంతోనే, వాలుకుర్చీలో కూల బడ్డాడు.

"మధురం ఒక గ్లాసెడు చల్లని నీళ్ళు" అన్నాడు నీరసంగా

"చలిచలిగా వుంటే చన్నీళ్ళేమి టండీ? వేడి కాఫీ పట్టుకొస్తాను," అంటూ వంటింట్లోకి పరుగెత్తింది మధురం తన తల్లి పెళ్ళినాడే చెప్పింది– 'ఈ పత్రికల్లో పని చేసేవాళ్ళకి ఆలోచ నలు ఎక్కువనీ. వరుస ఇలాటి శిరో వాతం వస్తుందనీ' – అనుకుంటూ కళ్ళు తుడుచుకుంది మధురం